క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



జలదంకి: మండల కేంద్రమైన జలదంకి ఎస్టీ కాలనీకి చెందిన పొట్లూరి శివ కుటుంబానికి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. ఇటీవల శివకు చెందిన పూరి గుడిసె అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఈ క్రమంలో ఆర్థిక సాయం అందించి, పక్కా ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు ముడి కిశోర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంటేరు రాకేష్‌రెడ్డి, కమతం బాలకోటయ్య, భీమవరపు మహేష్ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సన్మానం



ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన వైద్య ఉద్యోగులకు స్థానిక వైద్యశాలలో మంగళవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు శివకల్పన, వినీతలు బదిలీపై వెళ్లిన హెచ్ఈ కె.వెంకటసుబ్బయ్య, యూడీసీ సర్దార్, ఏఎన్ఎంలు నూర్జహాన్, షర్మిలా, పద్మా, దేవి, గిరిజలను శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్ఓ శివకుమారి, హెచ్ఈ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు చెన్నయ్య, అంకమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే



సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్

ఉదయగిరి రూరల్: మండలంలో జరిగే భూముల రీసర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ ఎల్.రామ్మోహన్ అన్నారు. ఆయన తన కార్యాలయంలో సర్వేయర్లు, రెవెన్యూ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే జరిపే ముందు పొలం యజమానికి సమాచారం ఇవ్వాలన్నారు. రీసర్వే సమయంలో రైతులకు ఎలాంటి అన్యాయం, పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. రీసర్వేపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సర్వేను బాధ్యతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీటీ షాజియా, రీసర్వే డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ అబ్బాస్, మండల సర్వేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగల చోరీ



మర్రిపాడు: మండలంలోని తిక్కవరం గ్రామ వ్యవసాయ పొలాల్లో ఉన్న త్రీ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగలు, ఇతర వస్తువులను చోరీ చేసిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. మర్రిపాడు నుంచి తిక్కవరం గ్రామానికి వెళ్లే మెయిన్ రోడ్డు పక్కన, పోలీస్ క్వార్టర్స్‌కు కూతవేటు దూరంలో ఉన్న గంగినేని తిరుపతి, ఇతర రైతులకు చెందిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు దించి, పగలగొట్టి దాని లోపల ఉన్న ఆయిల్, కాపర్‌వైర్‌తో పాటు ఇతర విలువైన వస్తువులను దొంగలించారు. దీనిని మంగళవారం ఉదయం రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీ, సింగారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్.షాను మంగళవారం తనిఖీ చేశారు. ప్రీస్కూల్ చిన్నారుల హాజరు శాతాన్ని పెంచి ఆటపాటలతో కూడిన విద్య అందించాలన్నారు. టీహెచ్ఆర్ పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలకు ఆధార్ మ్యాపింగ్‌తో పాటు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, పావని పాల్గొన్నారు.

గోవులకు టీకాలు

ఉదయగిరి: మండలంలోని ఆవులు, ఎద్దులు, దూడలకు లంపిస్కిన్ వ్యాధి (ముద్ద చర్మ వ్యాధి) టీకాలు వేస్తున్నట్లు గండిపాళెం పశువైద్యాధికారి రాఘవేంద్ర శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పశుపోషకులు ఉపయోగించుకోవాలి కోరారు.

కిడ్నాప్ చేసి.. వేలం కట్టబెట్టి

- ఎమ్మెల్యే చెప్పిన వ్యక్తికే పాట
- పరోక్షంగా సహకరించిన పోలీసులు

ఉదయగిరి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో వివిధ వనరుల రోజువారీ రుసుం కోసం మంగళవారం నిర్వహించిన వేలంపాట వివాదాస్పదంగా మారింది. టీడీపీ వర్గీయుల్లో తన అనుచరుడికే పాట దక్కేలా ఉదయగిరికి చెందిన ఓ ముఖ్యనేత ఎమ్మెల్యే ద్వారా అధికారులకు ఫోన్ చేయించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ వర్గీయుల్లో మరో కార్యకర్త మహబూబ్‌బాషా (లాడెన్) వేలంపాట తనకే దక్కేలా సిద్ధం చేసుకున్నారు. దీనిని పసిగట్టిన అవతలి వర్గం వారు పోలీసులను రంగ ప్రవేశం చేయించారు. వేలంపాటలో పాల్గొన వద్దని మహబూబ్‌బాషాకు చెప్పినా వినకపోవడంతో ఎమ్మెల్యేతో మాట్లాడి నిర్ణయం తీసుకుందామని కారులో ఎక్కించుకుని వరికుంటపాడు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ కొంతసేపు ఉంచి 12 గంటలకు ఉదయగిరి తీసుకొచ్చి విడిచిపెట్టారు. ఈ మేరకు ఆయన ధరావత్తు కట్టేందుకు ప్రయత్నించగా, మీ భార్య వార్డు మెంబర్ కావడంతో వేలంలో పాల్గొనే అర్హత లేదని పంచాయతీ కార్యదర్శి కరీముల్లా చెప్పారు. దీంతో వేరే వ్యక్తిని తీసుకొచ్చి ధరావత్తు చెల్లించేందుకు ప్రయత్నించగా, సమయం దాటిపోయిందని నిరాకరించారు. దీంతో మహబూబ్‌బాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి పోలీసులు తనను కావాలనే కిడ్నాప్ చేసి పాటలో పాల్గొనకుండా కుట్ర చేశారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని ఎంపీడీఓ అప్పాజీని నిలదీశారు. తాను మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు మనిషిని కావడంతో అన్యాయం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



ఎంపీడీఓను నిలదీస్తున్న బాషా

పంచాయతీ ఆదాయానికి గండి

ఈ వేలంపాట ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడింది. ఈ క్రమంలో మూడోసారి పక్కా ప్లాన్ ప్రకారం కథ నడిపించారు. ముందస్తుగా మహబూబ్‌బాషాను వేలంపాటకు దూరం చేయగా, పాటలో ముగ్గురి చేత ధరావత్తు కట్టించి నాటకీయ పరిణామాల మధ్య అధికార పార్టీ పెద్దల సూచన మేరకు కేవలం రూ.2.50 లక్షలకు ఫైజుల్లాకు కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తంతులో పంచాయతీ ఆదాయానికి గండిపడుతున్నా.. సర్పంచ్, పంచాయతీ అధికారులు నోరు మెదపకపోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో పోలీసులపై వచ్చిన ఆరోపణల గురించి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డిని వివరణ కోరగా, మేము ఎవరినీ కిడ్నాప్ చేయలేదని, మహబూబ్‌బాషా వేలంలో పాల్గొనే అర్హత లేనందున గొడవ పడుతుండడంతో అదుపులోకి తీసుకుని, తర్వాత వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న లేఅవుట్ల తొలగింపు



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పలు లేఅవుట్‌లను అనధికారికంగా ఏర్పాటు చేసినట్లు గుర్తించామని, దీంతో వాటిలోని హద్దురాళ్లు, డ్రెయిన్లు, సిమెంట్ రోడ్లను తొలగిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సి.గంగాప్రసాద్ తెలిపారు. అయితే నుడా అప్రూవల్ ఉన్న లేఅవుట్లను అనుమతి లేనివిగా ప్రకటించడం సరికాదని వాటి యజమానులు అంటున్నారు. నెల్లూరు–ముంబై రహదారి పక్కనే ఉన్న లేఅవుట్‌లలో మంగళవారం సిమెంటు రోడ్లను తొలగించడం పట్ల యజమాని సుధాకర్ రెడ్డి మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. లేఅవుట్‌లో నిర్మించిన భవనాలకు అనుమతులు ఉన్నాయని, ఆయన పత్రాలను చూపించగా మున్సిపల్ అధికారులు ఆ భవనాన్ని తొలగించడం లేదని, దానికి సమీపంలోని సిమెంటు రోడ్లను, డ్రెయిన్లను తొలగిస్తున్నామని తెలిపారు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. 3, 4 సంవత్సరాల క్రితం ఏర్పాటైన లేఅవుట్‌లలో ఇప్పటికే పలువురు ప్లాట్లు కొనుగోలు చేసి ఉన్నారు. అప్పుడు చర్యలు తీసుకోకుండా ఇప్పుడు రోడ్లు, డ్రెయిన్లను బ్లాక్ చేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆత్మకూరు సీఐ ఎం.గంగాధర్, ఎస్సై జిలానీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై ఆడిట్



ఉదయగిరి రూరల్: పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలపై స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ అధికారి నారాయణరెడ్డి మాట్లాడుతూ 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు పొదుపు సంఘాలలో జరిగిన లావాదేవీలపై ఇంటర్నల్ ఆడిట్ నిర్వహిస్తున్నామన్నారు. నగదు జమ, తీసుకున్న రుణాల నగదు వివరాలు, రికార్డులు పరిశీలించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులను నివేదిస్తామన్నారు. ఏపీఎం స్రవంతి, సీసీలు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణాన్ని పూర్తి చేయండి

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో డ్రెయిన్ లేక ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి ఈఓపీఆర్డీ వరప్రసాద్ సమక్షంలో పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. అదే సమయంలో జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ, సంగం మండల ప్రత్యేకాధికారి రమేష్‌నాయక్ అక్కడే ఉండడంతో రాజకీయాలు పక్కన పెట్టి వెంటనే డ్రెయిన్ నిర్మాణం చేపట్టేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి మల్లిని హెచ్చరించారు.

ఉపాధి పనులు కల్పించాలి

కావలి (జలదంకి): కావలి, జలదంకి, బోగోలు, కొండాపురం తదితర మండలాల్లో జాబ్ కార్డులు ఉన్న వారికి ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆయన ఈ మేరకు కావలి ఆర్డీఓ ఆఫీస్‌లో కార్యాలయ అధికారి సునీల్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి మండలం గౌరవరం గ్రామంలో గిరిజనులకు జాబ్‌కార్డులు లేవన్నారు. జలదంకి మండలం కేశవరం గ్రామంలో పదేళ్ల నుంచి ఉపాధి పనులు కల్పించలేదన్నారు.

బోగోలు మండలం పాత బిట్రగుంటలో కూలీ రూ.70 మాత్రమే ఇస్తున్నారన్నారు. కొండాపురం మండలంలో ఎనిమిది వారాల నుంచి కూలీలకు నగదు ఇవ్వలేదన్నారు. సీపీఎం నాయకులు కమలాకర్, జాన్, సీతారామయ్య ఉన్నారు.

గౌరవరంలో రామిరెడ్డి పర్యటన

కావలి(జలదంకి): కావలి రూరల్ మండలం గౌరవరంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మంగళవారం పర్యటించారు. తొలుత స్థానికంగా జరుగుతున్న పోలేరమ్మ తల్లి పొంగళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని పలు ఇళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. గ్రామంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడుతున్న రామిరెడ్డి

ప్రభుత్వం విస్మరించినా.. షైనింగ్ స్టారే

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల కేంద్రంలో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ధనలక్ష్మి పదో తరగతి ఫలితాల్లో 592 మార్కులు సాధించింది. కానీ ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డు జాబితాలో పేద విద్యార్థిని పేరు గల్లంతైంది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం మంగళవారం ఆ విద్యార్థినికి రూ.20 వేల నగదును అందజేశారు. ప్రభుత్వం విస్మరించినా టీచర్లు తగిన గౌరవం కల్పించడం పట్ల స్థానికులు ఉపాధ్యాయులను అభినందించారు. హెచ్ఎం నాగలక్ష్మితో పాటు టీచర్లు, విద్యార్థిని తల్లిదండ్రులు ఉన్నారు.



ధనలక్ష్మికి నగదు అందజేస్తున్న హెచ్ఎం

తప్పుల్లేని జాబితాను రూపొందించాలి

ఉదయగిరి: ఓటర్ల జాబితాలో తప్పుల్లేకుండా పక్కాగా రూపొందించాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి అన్నారు. ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏఆర్వోలు, రాజకీయ పార్టీల నాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏఆర్వోలు, బీఎల్వోలు సమష్టిగా పనిచేసి స్వచ్ఛమైన జాబితాలు తయారు చేయాలన్నారు. 1,200 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించాలన్నారు. జాబితాల్లో చనిపోయిన వారు, శాశ్వత వలసలు వెళ్లిన వారిని గుర్తించి తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరినీ గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. సీతారామపురంలో బుధవారం, ఉదయగిరి మండలాల్లో గురువారం బీఎల్వోలకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏఆర్వో ఎల్.రామ్మోహన్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

దుత్తలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని బీఎల్వోలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలో బూత్‌లెవెల్ అధికారులకు ఫారం–6, 6–ఏ, ఫారం–7, 8, ఓటర్ల జాబితా తయారీ, మార్పులు, చేర్పులు, మరణించిన, వలస వెళ్లిన వారి ఓటర్లను పరిశీలించాలన్నారు. అనంతరం బీఎల్వోలకు పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యనమల నాగరాజు, ఏఎస్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సీతారామపురం: మండలంలోని పండ్రంగి గ్రామంలో వ్యవసాయానికి సంబంధించి త్రీఫేజ్ విద్యుత్ లైన్లతో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ఆత్మకూరు ఈఈ భానునాయక్ రైతులకు అవగాహన కల్పించారు. ట్రాన్స్‌కో ఏఈ శ్రీహరి, లైన్‌మెన్లు రమేష్, మురళి, హరి, సిబ్బంది ఉన్నారు.

మహిళా కమిషన్‌పై అవగాహన

కావలి (జలదంకి): మహిళా కమిషన్‌పై అవగాహన పెంచుకుని రక్షణ పొందాలని కావలి లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి అన్నారు. పట్టణంలోని అరుంధతీయవాడ అంగన్‌వాడీ కేంద్రంలో సంఘ సంస్కర్త దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా మహిళా కమిషన్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ మహిళా చట్టాలు, హక్కుల పట్ల అవగాహన పెంచుకుని దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలత, విజయకుమారి పాల్గొన్నారు.

బ్రాహ్మణ మహాసంఘ జిల్లా అధ్యక్షుడిగా కళాధర్‌రావు



కావలి (జలదంకి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ మహా సంఘం జిల్లా అధ్యక్షుడిగా రేవూరు వెంకట కళాధర్‌రావును ఎన్నుకున్నారు. నరసరావుపేటలో మంగళవారం జరిగిన సమావేశంలో నెల్లూరు సంఘ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా శేషగిరిరావు, కార్యదర్శిగా మామిడిపల్లి చంద్రశేఖర్, ట్రెజరర్‌గా భట్టారం రాఘవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడిగా మాధవాచార్యులు, అర్చక పురోహిత విభాగం సలహాదారుడిగా నాగరాజులను రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రగంటి ప్రశాంత్‌శర్మ నియమించారు. అనంతరం కావలి వాసి, ఇంద్రజాలికుడు వేములపాటి మాధవరావుకి పురస్కారాన్ని అందించారు.

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడిగా కుమ్మిత



వరికుంటపాడు: జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని జి.కొండారెడ్డిపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడపలో జరిగిన జేవీవీ రాష్ట్ర 18వ మహాసభలో నూతన వర్గాన్ని ఎంపిక చేశారు. ఇందులో రాష్ట్ర సంఘానికి జరిగిన ఎన్నికల్లో కుమ్మిత శ్రీనివాసులురెడ్డిని ఎన్నుకున్నారు. ఈ క్రమంలో ఆయన్ను వరికుంటపాడు జేవీవీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లో రెండో విడత ఖాళీలను భర్తీ చేసేందుకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ షేక్.గౌస్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 22వ తేదీ సమీప ప్రభుత్వ ఐటీఐలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. 23వ తేదీ ఏఎస్‌పేటలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

దుత్తలూరు: స్వర్ణ పంచాయతీలో భాగంగా ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేయాలని కావలి డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండలాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటి కొలతలు, హద్దులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

సోమశిల: అనంతసాగరం మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్ట్‌ను తయారు చేసి గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. ఆయన చిలకలమర్రి గ్రామ పంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. గ్రామ సర్పంచ్, పాలకవర్గం సహకారంతో షెడ్ల నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడం, గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించి వారి ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని పంచాయితీ కార్యదర్శికి సూచించారు. అనంతరం పాతాళపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు.

జీవన ఎరువులకు ప్రాధాన్యమివ్వాలి

దగదర్తి: రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులకు ప్రాధాన్యమివ్వాలని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండల ఏఓ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో దామవరం, ఉలవపాళ్ల పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉలవపాళ్ల రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ జీవన ఎరువుల వాడకం వల్ల రైతులు పెట్టుబడి తగ్గించుకుని భూసారం పెంచుకోవాలని కోరారు. వ్యవసాయ సహాయకులు శ్రీజ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు

సంగం: రైతుల వ్యవసాయ సాగుకు అవసరమైన సాగునీరు అందిస్తామని సోమశిల ఎస్ఈ రమణారెడ్డి తెలిపారు. సంగంలోని కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ, బెజవాడ పాపిరెడ్డి కాలువ, క్రాస్ రెగ్యులేటర్లను, నీటి ప్రవాహాన్ని మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ కింద, బెజవాడ పాపిరెడ్డి కాలువ కింద సాగు చేసిన రైతులకు సాగునీరు అందించే విషయంలో లెక్కల్లో తేడాలొస్తే సహించేది లేదని తెలిపారు. సోమశిల జలాశయం నుంచి పెన్నా బ్యారేజ్‌కు 3600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సోమశిలకు కృష్ణా జలాలు 2,800 క్యూసెక్కులు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పెన్నా డెల్టా చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, డీఈ పెంచలయ్య, ఏఈ వినయ్, ఈస్టన్ చానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ రమణారెడ్డి

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

సంగం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ–4 కార్యక్రమ అమలపై పశుసంవర్ధకశాఖ జేడీ, సంగం మండల ప్రత్యేకాధికారి రమేష్ నాయక్ మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం పాటు పీ–4 అమలుపై గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. దాతల సహకారంతో పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడమే పీ–4 లక్ష్యమని పేర్కొన్నారు. తహసీల్దార్ సోమ్లానాయక్, ఈఓపీఆర్డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఆత్మకూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లకు నెలసరీ వేతనం రూ.21 వేలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, కమిషనర్ గంగాప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు శివప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగులు ఈనెల 12వ తేదీ నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా కమిషనర్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. నేటి రాత్రిలోపు సమస్యలను పరిష్కరించకపోతే ఇంజినీరింగ్ కార్మికులకు మద్దతుగా మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కె.హజరత్తయ్య, ఆత్మకూరు నాగయ్య, సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, నాగేంద్ర, మున్సిపల్ కార్మికుడు గురవయ్య పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు